నాసిరకం పనులకు వేదిక!



వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ.. వారికి సలహాలు, సూచనలు ఇచ్చేలా గత ప్రభుత్వం రైతు వేదికలను ప్రతిష్ఠాత్మకంగా నిర్మించింది. ఇంత వరకు బాగానే ఉన్నా, నిర్మాణ పనుల్లో గుత్తేదారులు నాణ్యత పాటించక పోవడంతో వాటి నిర్మాణాలు అప్పుడే దెబ్బతిన్నాయి. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో సుమారు 30 లక్షలతో రైతు వేదికను నిర్మించారు. దీని వరండాలు రెండు వైపులా కుంగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. నెర్రెల్లో పాములు చేరి బుసలు కొడుతుండటంతో అధికారులు, అక్కడకు వచ్చే రైతులు భయపడుతున్నారు. మండలంలోని బోడు, ఇతర రైతు వేదికల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది.

“ఇల్లెందు డివిజన్‌లో మొత్తం నాలుగు రైతు వేదికల్లో మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు చేయాలని పంచాయతీ రాజ్ అధికారులను కోరాం. దెబ్బతిన్న నిర్మాణాల పటిష్ఠతకు చర్యలు తీసుకుంటా” అని వ్యవసాయ శాఖ ఇల్లెందు డివిజన్ అధికారి లాల్ చంద్ అన్నారు.

– టేకులపల్లి, న్యూస్‌టుడే

నేడు ‘సీఎం కప్-2024’ క్రీడాజ్యోతి ర్యాలీ

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: సీఎం కప్-2024 టార్చ్ రిలే ర్యాలీ ములుగు జిల్లా నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంగళవారం ఉదయం ప్రవేశిస్తుందని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 3న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ర్యాలీ.. పలు జిల్లాల మీదుగా భద్రాద్రి జిల్లాకు చేరుకుంటోందని చెప్పారు. లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ వద్ద ఆహ్వానం పలుకుతూ.. కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వరకు ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, పీఈటీలు, పీడీలు, క్రీడా సంఘాలు, విద్యార్థులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలపై ఏకరవు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజలు దూర ప్రాంతాల నుంచి సమస్య పరిష్కారానికి వస్తుంటారని, నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అధికారులకు సూచించారు. ◆ తన భూమికి సంబంధించిన పట్టాదార్ పాస్‌పుస్తకంలో తప్పులున్నాయని, సరిచేయాలని మూడు నెలల క్రితం దరఖాస్తు చేసినా పరిష్కరించలేదని బూర్గంపాడు మండలానికి చెందిన గోనెల బ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు. దొర్లిన తప్పులను సరిదిద్దాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ◆ గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్తు కోసం దరఖాస్తు చేసినప్పటికీ జీరో బిల్లు రావడం లేదని, అర్హత ఉన్నందున పథకం అమలయ్యేలా చూడాలని పాల్వంచ మండలంలోని బొల్లోరిగూడేనికి చెందిన బొల్లి రవి కోరారు.




అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఆకాశమే హద్దురా..!

పాల్వంచ పట్టణం, మధిర పట్టణం, న్యూస్‌టుడే

మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా నేడు అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఆ మహనీయుడి జీవితం నేటి విద్యార్థి, యువ లోకానికి ఎంతో ప్రేరణ ఇస్తుంది. కలాం స్ఫూర్తితో ఎందరో ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. ‘మీ ప్రయత్నం లేకపోతే మీకు విజయం రాదు.. కానీ, మీరు ప్రయత్నిస్తే ఓటమి మాత్రం రాదు’ అని ఆయన అన్నారు. మారుమూల గురుకులాల్లో చదివిన వారు, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు ఈ మాటలే ప్రేరణగా విదేశీ విద్యనభ్యసించే స్థాయికి ఎదిగారు. విద్యతో నాస్తి దుర్భిక్షం అని నిరూపించారు. ఎంతోమంది విదేశాల్లో స్థిరపడి తమలాంటి పేద, మధ్య తరగతి వారికి దిశా నిర్దేశం చేస్తున్నారు. విద్య, విజ్ఞానార్జనలో ఆకాశమే హద్దురా అని చాటుతున్నారు. విదేశాల్లో విద్యార్థులుగా, వారికి వారధులుగా సహకరిస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురిని ‘న్యూస్‌టుడే’ పలకరించింది.



“కష్టాలు నిన్ను నాశనం చేయడానికి రాలేదు. నీ శక్తి సామర్థ్యాలను వెలికితీసి నిన్ను నీవు నిరూపించుకోడానికి వచ్చాయి. కష్టాలకు కూడా తెలియాలి.. నిన్ను సాధించడం కష్టమని”

- ఏపీజే అబ్దుల్ కలాం

పేద విద్యార్థులకు అండగా నిలుస్తా..

- దుగ్గినేని నవ్యంత్, వాషింగ్టన్ డీసీ



మధిర మండలం ఇల్లూరుకు చెందిన నేను.. అమెరికాలో చదవాలని చిన్ననాటి నుంచే కల కనేవాణ్ని. అబ్దుల్ కలాం అన్నట్లు.. ‘కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి’ అనే స్ఫూర్తితో, ఒక లక్ష్యంతో చదువు కొనసాగించా. ఉమ్మడి జిల్లాకు చెందిన వారెందరో అంతర్జాతీయంగా వివిధ దేశాల్లో చదువుకుని ఉన్నతోద్యోగాల్లో స్థిరపడ్డారు. నేనూ రాణించలననే ఆత్మవిశ్వాసంతో వాషింగ్టన్ డీసీ (యూఎస్‌ఏ)లోని జార్జ్ మాసన్ వర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేశాను. ఏడాదిగా గ్రాడ్యుయేట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. పేద విద్యార్థులకు అండగా ఉంటాను.

గ్రామీణ ప్రాంత విద్యాభివృద్ధికి కృషిచేస్తా..

రావూరి యశ్వంతి, డేటా ఎనలిస్ట్, ఒహియో, యూఎస్ఏ



నేను యూఎస్ఏ ఒహియో రాష్ట్రంలోని సిన్సినాటి విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ (కంప్యూటర్ సైన్స్) పూర్తిచేశాను. నా విద్యాభ్యాసం కోసం అమ్మానాన్నలు ఎంతో కష్టపడ్డారు. మా స్వగ్రామం మధిర మండలం మాటూరుపేట. విదేశాల్లో చదవాలనే కోరిక బలంగా ఉండేది. సిన్సినాటి వర్సిటీలో రెండేళ్ల క్రితం విద్య పూర్తవగానే ‘కేర్ సోర్స్, టైటన్’ కంపెనీలో డేటా ఎనలిస్ట్‌గా చేరా. మా గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషిచేయడమే లక్ష్యం.

విద్యార్థులకు ఎలాంటి సహకారాన్నైనా అందిస్తాం..

కొట్టె రామారావు, మెకానికల్ ఇంజినీర్, దక్షిణాఫ్రికా



మాది భద్రాచలం. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాల్వంచ గురుకుల (సీవోఈ) కళాశాలలో విద్యనభ్యసించా. బీటెక్ (మెకానికల్) చదివిన తర్వాత తగిన నైపుణ్యాలు సాధించి విదేశాల్లో స్థిరపడాలనేది నా కల. ఎల్‌అండ్‌టీ బాయిలర్ ఇంజినీర్‌గా పాల్వంచ కేటీపీఎస్‌లో విధులు నిర్వహించా. నా సామర్థ్యం గుర్తించిన యాజమాన్యం పవర్ కంపెనీ బాయిలర్ మేనేజర్‌గా పదోన్నతిపై దక్షిణాఫ్రికా పంపించింది. మంచి వేతనంతో గత పన్నెండేళ్లుగా ఉద్యోగం కొనసాగిస్తున్నా. అంతర్జాతీయంగా విద్యనభ్యసించాలనుకునే విద్యార్థులకు ఈ దేశంలో గతంలో కంటే మెరుగైన అవకాశాలున్నాయి. ఉమ్మడి ఖమ్మం విద్యార్థులకు మావంతు ప్రోత్సాహం అందిస్తున్నాం.

ఉద్యోగం చేస్తూనే.. నైపుణ్యాలు అందిపుచ్చుకుని..

- టి.రవి, కాస్మొటిక్ కంపెనీ మేనేజర్, టాంజానియా




పాత పాల్వంచకు చెందిన నేను స్థానిక సాంఘిక గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ వరకు చదివా. ఎంటెక్ తర్వాత విదేశాల్లో స్థిరపడాలనుకున్నా. తొలుత ఎల్‌అండ్‌టీ కంపెనీలో చేరా. సంస్థ తరఫున పాల్వంచలో కేటీపీఎస్ నిర్మాణ పనుల్లో పనిచేశా. ఇదే క్రమంలో విదేశాల్లో విధుల్లో రాణించేందుకు కావాల్సిన నైపుణ్యాల్ని కొందరు ఎన్నారై మిత్రుల సహకారంతో సంపాదించుకున్నా. 2011లో తూర్పు ఆఫ్రికాలోని టాంజానియాలోని కాస్మొటిక్ ఇండస్ట్రీలో మేనేజర్‌గా పనిచేసే అవకాశం దక్కింది. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు ఈ దేశంలో పుష్కలమైన అవకాశాలున్నాయి. సూచనలు, సలహాలకై ఎవరు సంప్రదించినా సహకరిస్తాం.

కొలువెక్కడో తేలేది నేడే..

కొత్త ఉపాధ్యాయులకు నేడు కౌన్సెలింగ్.. రేపు బాధ్యతల్లోకి..

పాల్వంచ విద్యా విభాగం, న్యూస్‌టుడే

‘డీఎస్సీ-2024’ విజేతల ఏళ్ల కలనెరవేరనుంది. కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టే తరుణం రానేవచ్చింది. ప్రతి ఉద్యోగికి తొలి పోస్టింగ్ ఓ విశేషమే. వారు పనిచేసిన మొట్టమొదటి ప్రాంతం జీవితంలో ఓ జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఇందుకోసం ఖమ్మం జిల్లాలో 520, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 413 మంది నూతనోపాధ్యాయులు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు. పోస్టింగ్ కేటాయింపునకు ఒకరోజు కౌన్సెలింగ్ నేడు(మంగళవారం) జరగనుంది. ఈ నెల 16 నుంచి బోధన ప్రారంభిస్తారు.



డీఈఓ కార్యాలయం ఆవరణలో కొత్త ఉపాధ్యాయులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 447కి గాను 413 పోస్టులు భర్తీ కానున్నాయి. నూతనోపాధ్యాయులకు పాత కొత్తగూడెం ఆనందఖని జిల్లా విద్యా కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి ఈ-కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రక్రియను డీఈవో ఎం.వెంకటేశ్వరాచారి పర్యవేక్షించనున్నారు. ప్రత్యేక విద్య (శ్రవణ లోపం) కేటగిరీలో మరికొన్ని పోస్టుల భర్తీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాల్సి ఉంది. ఇవి మినహా తాజా కౌన్సెలింగ్‌తో మొత్తం ‘డీఎస్సీ-2024’ నియామక ప్రక్రియ పూర్తవుతుంది. కొత్త టీచర్లందరికీ ఈ నెల 10వ తేదీ నుంచే వేతన భత్యాలను వర్తింపజేయనున్నారు. పోస్టుల భర్తీతో ఉమ్మడి జిల్లాలోని సుమారు 600 ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం కానున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం యుద్ధప్రాతిపదికన ఉపాధ్యాయ పోస్టుల నియామక ప్రక్రియ చేపట్టాం. ఇటీవల హైదరాబాద్‌లో నియామక పత్రాలు అందుకున్న వారంతా రిపోర్టింగ్ చేయడం, తాజాగా కౌన్సెలింగ్ చేపట్టడం చకచకా కొనసాగుతున్నాయి. ఎల్లుండి (బుధవారం) నుంచి కొత్త ఉపాధ్యాయులు బోధన ప్రారంభిస్తారు. వారికి విధుల పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూస్తాం. ఏకోపాధ్యాయ పాఠశాలల్ని మరింత బలోపేతం చేస్తాం. - ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

విద్యతోనే ఆదివాసీల అభ్యున్నతి

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: విద్యతోనే ఆదివాసీల సమస్యలు సమసి పోతాయని ఆదివాసీ నాయకపోడు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పసల బుచ్చయ్య అన్నారు. అశ్వారావుపేటలో నాయకపోడు సంఘం రాష్ట్ర సమ్మేళనాన్ని సోమిని ప్రసాదు అధ్యక్షతన స్థానిక గిరిజన భవన్‌లో సోమవారం నిర్వహించారు. బుచ్చయ్య మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రాణించినప్పుడే ఆదివాసీలు ఆర్థికంగా, సామాజికంగా అభ్యున్నతి సాధిస్తారన్నారు. హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని సూచించారు. 1/70 చట్టం, ఆర్వోఎఫ్ఆర్ హక్కు పత్రాల సాధనకు ఉద్యమం చేయాల్సి రావడం బాధాకరమన్నారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రావుల శ్రీను, ఏపీ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు అప్పిరెడ్డి నాగు, జిల్లా అధ్యక్షుడు రాసా శ్రీను, కొయ్యల అచ్యుతరావు, పూసి గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పసల బుచ్చెయ్య

2 కి.మీ. దూరానికి.. 16 కి.మీ. ప్రయాణం!

అశ్వాపురం, న్యూస్‌టుడే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లి-కుమ్మరిగూడెం గ్రామాల మధ్య ప్రధాన రహదారి పదేళ్లుగా కరవైంది. అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ కేంద్రానికి కేవలం 2 కి.మీ. దూరంలో ఉండే కుమ్మరిగూడెంకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి జగ్గారం అడ్డరోడ్డు నుంచి మిట్టగూడెం, పాములపల్లి గ్రామాల మీదుగా 16 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కాలినడకన వెళ్లాలంటే సీతారామ ప్రాజెక్టు మట్టికట్టలపై నుంచి అష్టకష్టాలు పడుతూ నడిచి వెళ్లాలి. వర్షాలొస్తే.. అదీ సాధ్యంకాదు.

ప్రాజెక్టు రాకతో.. అమ్మగారిపల్లి-కుమ్మరిగూడెం మధ్య తారు రహదారి ఉండేది. 65 అడుగుల గోదావరి వచ్చినా ముంపునకు గురికాకుండా ఎత్తు పెంచాలనే ప్రతిపాదనలూ ఉన్నాయి. సర్ అర్థర్ కాటన్ నిర్మించిన దుమ్ముగూడెం ఆనకట్టకు రాకపోకలు కొనసాగించడానికి అప్పట్లో ఇదే ప్రధాన మార్గం. ఈ లోగా సీతారామ ప్రాజెక్టు వచ్చింది. ప్రధాన కాలువ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మట్టి, రాళ్లకుప్పలన్నీ పోయడంతో రహదారి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. మరోవైపు ‘సీతమ్మసాగర్’లో భాగంగా గోదావరికి ఇరువైపులా కరకట్టల నిర్మాణం జరగనుంది. కరకట్టల వెంట కాలువల నిర్మాణం కొనసాగనుంది. ఆ కాలువకు కుడివైపున అమ్మగారిపల్లి-కుమ్మరిగూడెం గ్రామాలకు ప్రధాన రహదారిని నిర్మించాలనేది తాజ ప్రతిపాదన. ఇవన్నీ పూర్తయ్యేదెన్నడో.. కుమ్మరిగూడెం రోడ్డు కష్టాలు కడదేరేదెన్నడో? అధికారులకే తెలియాలి.



అమ్మగారిపల్లి-కుమ్మరిగూడెం రహదారి ఇక్కడితోనే అంతం..

‘అమ్మగారిపల్లి-కుమ్మరిగూడెం రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలున్నాయి. అప్పటి వరకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏమైనా ఉన్నాయా? అనేది పరిశీలన జరుపుతాం.’

- శ్రీనివాస్, డీఈ, జలవనరుల శాఖ

వేంకటేశ్వరాలయంలో పవిత్రోత్సవాల సందడి



పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు శేషాచార్యులు

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ నవనగర్ కొండపై కొలువైన శ్రీవేంకటేశ్వరాలయంలో పవిత్రోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకుడు శేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. స్వామివారికి తొలి రోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ పూజలు చేశారు.

జూలూరుపాడు ఠాణాను సందర్శించిన ఎస్పీ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సాయంత్రం కొత్తగూడెం ఎస్పీ బి.రోహిత్ రాజు సందర్శించారు. సీఐ ఇంద్రసేనారెడ్డితో కాసేపు మాట్లాడారు. జూలూరుపాడు సర్కిల్ పరిధిలోని కేసుల గురించి వాకబు చేశారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది సున్నిత సమస్యలపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ఏమైనా సమస్యలుంటే ముందుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాగర్ భౌతికకాయం ఏన్కూరుకు చేరుకున్న క్రమంలో అటుగా వెళ్తూ స్టేషన్‌ను సందర్శించినట్లు స్థానిక పోలీసు అధికారులు తెలిపారు.

‘కేటీసీ కార్మికులకూ బోనస్ ఇవ్వండి’

టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి కోయగూడెం ఉపరితల గని (కేటీసీ) ఎల్ఎస్ఎన్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు సింగరేణి ఒప్పంద కార్మికులకు మాదిరిగా రూ.5 వేల బోనస్‌ను వర్తింపజేయాలని ఐఎన్‌టీయూసీ గౌరవ సలహాదారు కోరం సురేందర్ సింగరేణి యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలను ఆయన కార్మికులతో కలిసి కేటీసీ పీవో వాసంశెట్టి శ్రీనివాస్‌కు సోమవారం విన్నవించారు. ఓబీ కార్మికుల పీఎఫ్‌ను కూడా ఖాతాలో జమ చేయించాలని సురేందర్ కోరారు. దీంతో స్పందించిన పీవో బోనస్‌ను రెండు రోజుల్లో కార్మికుల ఖాతాల్లో జమచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చ సుధాకర్, కాంగ్రెస్ నాయకులు సర్దార్, పోశాలు, కార్మికులు పాల్గొన్నారు.



పీవోకు సమస్యలను వివరిస్తున్న కోరం సురేందర్, కార్మికులు

పశువైద్యులొచ్చే..!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే



రాష్ట్ర పశుసంవర్ధక శాఖ పరిధిలో ఎంపికైన 171 మంది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(ఏవీఎస్)లకు ఇటీవల అదనపు సంచాలకురాలు మల్లేశ్వరి నియామక పత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. దీంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఖాళీలు భర్తీ అయ్యే అవకాశం ఏర్పడింది. పదేళ్లుగా నియామకాలు లేకపోవటంతో గ్రామీణ ప్రాంతాల్లోని పశువులకు సరైన వైద్యం అందటం లేదు.

భద్రాద్రి జిల్లాలో... 22 మండలాలు ఉండగా 14 మండలాలకు పశువైద్యులు లేరు. 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా ఏజెన్సీ ఏరియాలోని దూర ప్రాంతాలైన చర్ల, గుండాల, పినపాక, ఆళ్లపల్లి, కరకగూడెం, ఏడూళ్లబయ్యారం ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఏజెన్సీలో పశువైద్యం మెరుగుపడాలంటే.. ముందుగా ప్రతి మండల కేంద్రంలోని ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. కొత్త నియామకాల్లో కనీసం 15 నుంచి 17 మందిని ఈ ప్రాంతానికి కేటాయిస్తేనే సమస్య కొంత తీరే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లాలో.. ఎర్రుపాలెం, వేంసూరు, కల్లూరు, తల్లాడ, సత్తుపల్లి, సింగరేణి లాంటి మండల కేంద్రాల్లో పశువైద్యులు లేరు. పక్కనున్న వారికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. జిల్లాలోని పలుచోట్ల మొత్తం 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొత్తగా మంజూరు చేసిన వైద్యులతో వీటిని భర్తీ చేయనున్నారు.

తల్లీ బిడ్డలకు తప్పని గండం

◆ అత్యవసరమై ‘గూడెం’ ఎంసీహెచ్‌కొస్తే.. ఖమ్మం వెళ్లాల్సిందేనా?

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

✪ పసిగుడ్డుకు జ్వరం వచ్చిందని రెండ్రోజుల క్రితం తల్లీపిల్లల దవాఖానాకు తీసుకొస్తే.. పరీక్షలు చేసి, చికిత్స అందించినా ఫలితం లేదని వైద్యులు చెప్పారు. ప్లేట్‌లెట్లు తగ్గాయని, ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పారు.



✪ 13 నెలల మగబిడ్డకు తరచూ ఫిట్స్ వచ్చాయని తల్లిదండ్రులు తీసుకొస్తే.. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చికిత్స అందించి ఖమ్మం రిఫర్ చేశారు. అదేమంటే, ఇక్కడ మెరుగైన వైద్యం లేదనే సమాధానం వచ్చింది.

✪ వెంటిలేటర్ సదుపాయం లేదనే కారణంతో మరో నవజాత శిశువును ఖమ్మం ఎంసీహెచ్‌కు పంపారు.

ఇదీ.. కొత్తగూడెం రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో రిఫరల్ పరంపర. ఇలా కేవలం ఒక రోజు వ్యవధిలో (సోమవారం) ఐదు కేసులను ఖమ్మం జిల్లా సర్వజన ఆసుపత్రికి ఇక్కడి వైద్యులు పంపించారు. వెంటిలేటర్ లేదని ఒకరిని, ఆక్సిజన్ లేదని ఇంకొకరిని, వైద్యులు అందుబాటులో లేరని మరికొందరిని తిప్పి పంపించేశారు. ఔషధాలు, పరికరాలు వంటి కొరత ఉందంటూ నిండు గర్భిణులు, నవజాత శిశువులను పెద్దాసుపత్రులకు రిఫర్ చేస్తుండటంతో బాధిత కుటుంబాలు వ్యయప్రయాసలు కోర్చి వెళ్తున్నాయి. కొందరు పురిటినొప్పులతో హుటాహుటిన వస్తే.. ఖమ్మం వెళ్లండంటూ తాపీగా సమాధానమిస్తున్న వైనం ఆవేదనకు గురిచేస్తోంది. ఏదైనా సమస్య ఉన్నవారికి ఒకట్రెండు రోజులైనా తగ్గకుంటే చేతులెత్తేస్తున్నారని రోగులు వాపోతున్నారు. ప్రసవాలదీ ఇదే తీరుగా మారింది. రోజుకు 15 నుంచి 20 వరకు జరిగే కాన్పులు.. ఇప్పుడు ఏకంగా 40 శాతానికి తగ్గుముఖం పట్టాయి. సదుపాయాల్లేక పోవడమూ ఈ దుస్థితి ఒక కారణం. టిఫా స్కానింగ్ సేవలూ అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి.

‘108’ సేవలకూ ఇబ్బంది..

రిఫరల్ కేసులు ఎక్కువవుతుండటంతో ఎంసీహెచ్‌కు వచ్చే ‘108’లు వెంటనే ఖమ్మం వైపు వెళ్లాల్సి వస్తోంది. ఒకరోజు రెండు, మూడు కేసులను ఇలా తీసుకెళ్లాల్సి వస్తుండటంతో మిగతా అత్యవసర సేవలకు వాహనాలు అందుబాటులో ఉండటం లేదు. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో కాల్ చేసినా మిగతా మండలాల నుంచి వాహనాలు వచ్చేంత వరకు నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంటోంది.



రామవరంలోని ఎంసీహెచ్ భవనం

మెరుగైన సేవలందేలా చూస్తున్నాం..

డా.రాధామోహన్, సూపరింటెండెంట్

ఆసుపత్రిలో ప్రసూతి సేవలందించే వైద్యుల సంఖ్య తక్కువగా ఉంది. పూర్తిస్థాయిలో పోస్టులను నియమిస్తే సేవలు మరింత మెరుగవుతాయి. ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చినా స్పందన రాలేదు. ఉన్న ఒకరిద్దరు నిపుణులతోనే కాలం వెళ్లదీస్తున్నాం. క్రిటికల్ కేసులను మాత్రమే ఖమ్మం, వరంగల్ ప్రాంతాలకు పంపుతున్నాం. సాధారణ సమస్యలున్న వారికి ఇక్కడే నయం చేస్తున్నాం. ఇతర వైద్య సదుపాయాల కల్పనకు పరిష్కార మార్గాలు అన్వేషిస్తున్నాం. సాధ్యమైనంత మేర మెరుగైన సేవలందించేలా చూస్తాం.

సాగు మారింది.. రాబడి పెరిగింది

మూస సాగు పద్ధతులను స్వస్తిచెప్పి శాస్త్రవేత్తల సూచనలతో ఓ రైతు లాభాల బాట పట్టారు. కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన మల్లేపల్లి అప్పారావు సంప్రదాయ విధానంలో పత్తి సాగు చేస్తుండేవారు. వైరా కేవీకే శాస్త్రవేత్తల



సూచనలతో గతేడాది అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టారు. సాధారణ పద్ధతిలో ఎకరానికి 4,900 పత్తి విత్తనాలు మాత్రమే నాటగా అధిక సాంద్రత విధానంలో ఎకరాకు 29,629 నాటారు. విత్తనాల నాటడంలో శాస్త్రవేత్తలు నిర్దేశించిన ప్రమాణాలను ఆయన పాటించారు. ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టారు. పంట కాల పరిమితి సాధారణంకంటే ముందే నవంబరులోనే ముగిసింది. సాధారణ పద్ధతిలో ఎకరాకు రూ.18,050 ఆదాయం, 8 క్వింటాళ్ల దిగుబడి రాగా అధిక సాంద్రత విధానంలో ఎకరానికి నికర ఆదాయం రూ.53,140తోపాటు 15 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. సాధారణ పద్ధతిలో ఆదాయ, వ్యయ నిష్పత్తి 1:54 కాగా నూతన విధానంలో 2.23గా ఉన్నట్లు కేవీకే శాస్త్రవేత్త కె.రవికుమార్ తెలిపారు. శాస్త్రవేత్తల సూచనలతోనే తక్కువ వ్యవధిలో అధిక లాభాలు సాధించినట్లు రైతు అప్పారావు పేర్కొన్నారు.

- వైరా, న్యూస్‌టుడే

నిండా ముంచుతున్న ఎండాకు తెగులు



కూసుమంచిలో తెగులు సోకిన వరి పైరు

కూసుమంచి, న్యూస్‌టుడే

ఖమ్మం జిల్లాలో మున్నేరు, పాలేరు, ఆకేరు వరద ప్రభావిత ప్రాంతాల్లోని అన్నదాతలకు ఖరీఫ్‌లో ఆటుపోట్లు తప్పటం లేదు. అధిక వర్షాలు, ఆ వెంటనే విపరీత ఉష్ణోగ్రతల ప్రభావం కారణంగా వరిలో ఎండాకు తెగులు విజృంభిస్తోంది. ఉభయ జిల్లాల్లో అధిక వర్షాలు కురిసిన ఇతర ప్రాంతాల్లోనూ ఈ సమస్య ఉంది. రెండు నెలల క్రితం సాగు చేసిన వరి పైరు ప్రస్తుతం చిరుపొట్ట, పొట్ట దశల్లో ఉంది. పైరుపై ఆశించిన ఎండాకు తెగులు కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఎకరాకు రూ.22-25 వేల వరకు పెట్టుబడిగా వెచ్చించిన రైతులు, ఈ తెగులు ప్రభావంతో పైరు పూర్తిగా ఎండుతూ గడ్డిలా మారిపోతుండటంపై ఆందోళన చెందుతున్నారు. సన్న రకాలు సాగు చేసిన పొలాల్లో తెగులు ఉద్ధృతి తీవ్రంగా ఉందని చెబుతున్నారు.

నివారణ.. ఎండాకు తెగులు నివారణకు వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్త డాక్టర్ వి.చైతన్య పలు సూచనలు చేశారు. లక్షణాలు గుర్తించిన వెంటనే పైపాటుగా నత్రజని ఎరువు వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు నివారణకు ఎలాంటి మందులు లేవని గుర్తించాలి. వ్యాప్తిని నివారించడానికి రాగి ధాతు శిలీంద్రనాశిని అయిన కాపర్ హైడ్రాక్సైడ్ 2.0 గ్రా, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4 గ్రాము ఒక లీటరు నీటికి కలిపి దుబ్బు చేసే దశలో ఉన్న వరిపైరులో పిచికారీ చేయాలి. వరి పంట పూత దశలో ఉన్నప్పుడు మాత్రం కాపర్ శిలీంద్రనాశిని పిచికారీ చేయొద్దు. సమగ్ర యాజమాన్య చర్యల్లో భాగంగా ఆఖరి దఫాగా పొటాష్ ఎరువును ఎకరానికి 15 నుంచి 20 కిలోల వర్షాలు తగ్గాక పొలంలో చల్లాలి.

రైతేరాజు

అప్రమత్తంగా లేకుంటే అనర్థమే..



సత్తుపల్లి, న్యూస్‌టుడే

జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం అమల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 15న ప్రారంభమయ్యే టీకాల పంపిణీ కార్యక్రమం దాదాపు నెల రోజులపాటు కొనసాగనుంది. నూరు శాతం వ్యాక్సినేషన్ వేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. టీకా సామర్థ్యం ఆరు నెలలు. అందుకే ప్రతి ఆరు నెలలకోసారి వీటిని అధికారులు మూగజీవాలకు ఉచితంగా అందిస్తున్నారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి ఆవు, గేదెలకు టీకాలు వేయనున్నారు.

పనితీరుపై ప్రభావం: దేశవాళి కంటే ఎక్కువగా సంకరజాతి పశువుల్లో గాలికుంటు వ్యాధి తీవ్రత ఎక్కువ. దేశవాళీ పశువుల్లో ప్రాణ నష్టం పెద్దగా లేకున్నా వ్యాధి తీవ్రత అధికం. టీకాలు వేయించుకుంటే ఊపిరితిత్తుల పనితీరుపై ప్రభావంపడి పశువులకు తీవ్రంగా రొప్పు రావడం, పనిచేసే సామర్థ్యం తగ్గి, పాల ఉత్పత్తి పడిపోతుంది. ఓ దశలో చిన్న పశువులు అధిక ఉష్ణోగ్రతతో మృతి చెందే ప్రమాదం ఉంటుంది.

లక్షణాలు ఇలా..

- పశువులు నడవలేక పోవడం, దుక్కిదున్నే పనులు చేసే సామర్థ్యాన్ని కోల్పోవడం.
- 103 నుంచి 106 డిగ్రీల జ్వరం రావడం.
- మూగజీవాల నోట్లో, చిగుళ్లపై పొక్కులు వచ్చి మేత, నీళ్లు తీసుకోలేకపోవడం. నోటి నుంచి సొంగకారడం.
- కాలు గిట్టల్లో పుండ్లుపడి పురుగులు రావడం.

'వ్యాధి బారినపడ్డాక వైద్యం చేయించుకుంటే కంటే ముందే అప్రమత్తమై రైతులు తమ పశువులకు నివారణ టీకాలు వేయించాలి. ఇంటికి వచ్చే వైద్య సిబ్బందికి సహకరించి గాలికుంటు వ్యాధి నుంచి తమ మూగజీవాలను కాపాడుకోవాలి.'



- ఎం.వెంకటేశ్వర్లు, ఏడీ, పశువైద్యశాల, సత్తుపల్లి.

ప్రశ్న జవాబు

? వరిలో సుడిదోమ ఆశించింది. నివారణ తెలపండి..
పాపారావు, మాటూరుపేట

◆ ప్రస్తుత పరిస్థితుల్లో వరిని సుడిదోమ ఆశించడానికి వాతావరణం చాలా అనుకూలం. దీని ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాము లేదా బైఫ్లూ ఫ్యూరాన్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.





? మంచి సెనగ, పులుసెనగ రకాలు తెలపండి. ఎప్పటి వరకు విత్తనం వేసుకోవచ్చు? **శేషయ్య, దొర్నకల్**

◆ నంద్యాలగ్రామ్ - 452 జేజీ 11, నంద్యాల సెనగ 47 దేశీయ రకాలు అనుకూలం. సెనగ పంటను నవంబరు మొదటి పక్షం వరకు వేసుకోవచ్చు. ఇంకా ఆలస్యంగా ఉంటే పూత సమయంలో ఉష్ణోగ్రతలు ఎక్కువై దిగుబడులు తగ్గే అవకాశం ఉంది.

– మధిర, న్యూస్‌టుడే

డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త మధిర పరిశోధన స్థానం

రైతులు తమ సందేహాలను పంపాల్సిన వాట్సప్ నెంబరు: 76750 50041

చదువుల తల్లికి సాయమందించరూ..

☆ వైద్యవిద్యలో సీటు సాధించిన గిరి పుత్రిక

మానవీయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే

వైద్యురాలిగా ఎదిగి సమాజానికి తన వంతు సేవ చేయాలన్న ఆలోచనతో బైపీసీ కోర్సును ఎంచుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ యువతి నాలుగేళ్ల క్రితమే నీట్‌లో ప్రతిభ చూపినా ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ముందుకెళ్లలేకపోయింది. ఎలాగైనా వైద్యవిద్య చదవాలనే తలంపుతో ఈ ఏడాది నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ సీటు సాధించింది. కానీ మళ్లీ పేదరికమే ఆ విద్యార్థిని పురోగతికి ప్రతిబంధకంగా మారింది.

సత్తుపల్లి పట్టణ పరిధిలోని గుడిపాడుకు చెందిన నాయకపోడు గిరిజన దంపతులు రాజిని ప్రసాద్, నాగమణి కుమార్తె శివభార్గవి. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబంలో జన్మించిన శివభార్గవి ఐదో తరగతి వరకు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకుంది. ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్య చదివి, ఖమ్మంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ గురుకుల కళాశాలలో 2020లోనే ఇంటర్ (బైపీసీ) పూర్తి చేసింది. అదే ఏడాది నీట్ పరీక్ష రాసి కేటగిరీ విభాగంలో ర్యాంక్ సాధించినా వైద్యవిద్య చదివేందుకు కావల్సిన కనీస పరిస్థితులు లేక విరమించుకుంది. కానీ ఎలాగైనా తన జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని భావించి తల్లిదండ్రులను ఒప్పించి మళ్లీ నీట్ ప్రవేశ పరీక్ష రాసింది. కోచింగ్ సెంటర్లకు వెళ్లి కుస్తీపడితే తప్ప ప్రవేశం దొరకని కోర్సులో సీటు కోసం ఇంట్లోనే ఉంటూ యూట్యూబ్ తరగతుల సాయంతో సిద్ధమైంది. ఈ ఏడాది నీట్‌లో స్టేట్ ర్యాంకు 7,146, ఎస్టీ కేటగిరీ ర్యాంకు 567 సాధించింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాలలో శివభార్గవికి సీటు వచ్చింది. 'ఏ' కేటగిరీ విభాగంలో ఏడాదికి రూ.2.5 లక్షల చొప్పున వైద్యవిద్యకు దాదాపు రూ.12.5 లక్షలు అవసరమవుతాయి. రీయింబర్స్ రూపంలో చాలా స్వల్ప మొత్తంలోనే మినహాయింపు ఉంటుంది. ఈ నేపథ్యంలో చదువుకోవాలన్న బిడ్డ తపనను చూస్తున్న తల్లిదండ్రులు ఏం చేయాలో తోచని స్థితిలో కుమిలిపోతున్నారు. కళాశాల రుసుములు, మెటీరియల్స్, పుస్తకాల కొనుగోలుకు సాయం అందించి తమ కుమార్తె చదువుకు అండగా నిలవాలని దాతలను వేడుకుంటున్నారు. **దాతలు సంప్రదించాల్సిన నంబరు: 9394450050**



తల్లిదండ్రులతో విద్యార్థిని శివభార్గవి

గిరిజన యువతకు ఉచిత శిక్షణ: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన గిరిజన యువతను వివిధ రంగాలలో నైపుణ్యం వచ్చేలా తీర్చిదిద్దేందుకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు పీఓ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసున్నవారు ఈనెల 18న ఉదయం 9 గంటలకు భద్రాచలం వైటీసీలో నిర్వహించే ఎంపిక కౌన్సెలింగ్‌కు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. టైలరింగ్‌కు కనీసం ఐదో తరగతి, బ్యూటీషియన్ తర్ఫీదు పొందేందుకు ఎనిమిదో తరగతి చదివిన యువతులు అర్హులని తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ శిక్షణకు ఎనిమిదో తరగతి చదివిన యువకులు అర్హులని వెల్లడించారు. తేనెటీగల పెంపకంలో ఆసక్తి గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

మందారం కాదండోయ్.. ఎర్ర గోంగూర



ఈ చిత్రంలో పువ్వులను చూస్తే ఎర్ర మందారం ఎంచక్కా ఉంది కదూ అనిపిస్తుంది. కానీ ఇది మందారం పువ్వులు కాదు. వైరా ఇందిరమ్మకాలనీ సమీపంలోని ఓ రైతు పొలంలో ఎర్ర గోంగూరకు పూసిన పూలు.. ఇలా మందారం పూల మాదిరిగా కనిపిస్తున్నాయి.

- వైరా, న్యూస్‌టుడే

మూతపడిన ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు

నిరవధిక బంద్‌కు నిర్ణయం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం కళాశాలలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. విద్యార్థులు లేక వెలవెలబోయాయి. అధ్యాపకులు మద్దతు తెలిపారు. యాజమాన్యాలు నిరవధిక బంద్ పాటించాలని నిర్ణయించాయి. ఈ మేరకు ఆయా కళాశాలల ఎదుట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. పలు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు కళాశాలల ఎదుట నినాదాలు చేశారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కళాశాలలు మూతపడటంతో వచ్చిన విద్యార్థులు వెనుదిరిగి వెళ్లారు. మూడు సంవత్సరాల నుంచి కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో యాజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో కళాశాలలు మూతపడటంతో విద్యార్థుల పరీక్ష ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ సందర్భంగా యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రభుత్వం, రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. ఇప్పటికీ దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధికంగా కళాశాలలను మూసివేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా వారికి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టోకెన్లు ఇచ్చిన వాటికైన రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు.



ఖమ్మంలోని డీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఎదుట నినాదాలు చేస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకులు

ప్రాంగణాలు కిటకిట.. ప్రయాణం కటకట

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: దసరా పండుగకు సొంతూళ్లకు చేరుకున్న ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఆది, సోమవారాల్లో బస్టాండ్లలో రద్దీ గణనీయంగా పెరిగింది. ఆర్టీసీ బస్సులు సైతం కిటకిటలాడాయి. ఫలితంగా ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూరనుంది. ప్రయాణికుల స్పందనకు అనుగుణంగా అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. హైదరాబాద్, మణుగూరు, భద్రాచలం, సత్తుపల్లి మార్గాల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ఖమ్మం రీజియన్‌లో రెండు రోజుల్లో దాదాపు 328 బస్సులు అదనంగా నడిపారు. హైదరాబాద్ నుంచి 55 సిటీ బస్సులను రప్పించారు. ఖమ్మం రీజియన్ నుంచి మిగతా సర్వీసులను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి వరకూ బస్టాండ్ రద్దీగా ఉంది. మరో రెండు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదే అదనుగా కొంతమంది దొంగలు తమ చేతివాటం ప్రదర్శించారు. పాత బస్టాండులో ఓ ప్రయాణికురాలి గొలుసు అపహరించారు. ప్రయాణికుల తాకిడి నేపథ్యంలో ప్రత్యేక బస్సుల్లో అదనపు ఛార్జీలు వడ్డించారు. రూ.100 ఛార్జి ఉన్నచోట రూ.150 చొప్పున వసూలు చేశారు. యాజమాన్యం ఆదేశాల మేరకే అదనపు ఛార్జీలు తీసుకుంటున్నట్లు ప్రాంతీయ మేనేజర్ సరిరాం వివరించారు.



ఖమ్మం నూతన బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

కానిస్టేబుల్ సాగర్‌కు నివాళి

☆ కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంఘాల నిరసన
☆ ఎమ్మెల్యే, ఎస్పీ పరామర్శ

ఏన్కూరు, న్యూస్‌టుడే: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఆత్మహత్యకు పాల్పడిన భూక్యా సాగర్ అంత్యక్రియలు సోమవారం రాత్రి ఆయన స్వగ్రామం ఏన్కూరులో జరిగాయి. ఈ ఏడాది జనవరిలో బూర్గంపాడులో విధులు నిర్వహిస్తున్న సమయంలో గంజాయి చోరీ ఘటనలో సస్పెన్షన్‌కు గురయ్యారు. అక్కడ కొంత మంది అధికారులు, ఓ నాయకుడు తనను అన్యాయంగా ఆ కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఈనెల 12న ఏన్కూరు సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం విదితమే. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన సాగర్ మృతదేహాన్ని ఏన్కూరు తరలించారు. మృతదేహాన్ని చూసి భార్య, పిల్లలు, తల్లిదండ్రులు బోరున విలపించారు. ప్రభుత్వం ఉద్యోగం సాధించిన కుమారుడు తమకు అండగా ఉంటాడనుకుంటే కానరాని లోకాలకు వెళ్లాడంటూ కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మధ్యాహ్నమే సాగర్ ఇంటికి చేరుకుని ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అక్కడకు చేరుకున్న గిరిజన సంఘాలు, కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకున్నారు. సాగర్ ఆత్మహత్యకు కారకులైన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భార్య, పిల్లలకు నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. మృతదేహం వచ్చే సమయానికి వివిధ రాజకీయ పక్షాలు, గిరిజన సంఘాలు, గిరిజనుల పెద్దసంఖ్యలో తరలిరావడంతో ముందస్తుగా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కొద్దిసేపటికి ఎస్పీ రోహిత్‌రాజ్ అక్కడకు చేరుకుని ఎమ్మెల్యే, ఖమ్మం డీసీపీ నరేశ్‌కుమార్‌తో కలిసి మృతదేహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం గిరిజన సంఘాలతో సమావేశమయ్యారు. శాఖాపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారు. తక్షణ సాయంతో రూ.లక్ష నగదు అందజేశారు. ఎస్పీ హామీతో గిరిజన సంఘాలు, కుటుంబ సభ్యులు శాంతించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, చంద్రబాను, పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, సీఐలు సాగర్, ముత్తిలింగం వివిధ మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.



సాగర్ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు



సాగర్ ఇంటి వద్ద ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఎస్పీ రోహిత్‌రాజ్, గిరిజన సంఘాలు, రాజకీయ నాయకులు

కానిస్టేబుల్ కొడుకుగా అండగా ఉంటా: ఎస్పీ రోహిత్‌రాజ్

ఓ కానిస్టేబుల్ కొడుకుగా తనకు ఆ కుటుంబాల బాధలు తెలుసని మృతి చెందిన సాగర్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రకటించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తోపాటు గిరిజన సంఘాలు తమ దృష్టికి తెచ్చిన హామీలు పరిష్కరిస్తామన్నారు. కానిస్టేబుల్ సాగర్ భార్య విద్యార్హతకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగం, వారికి అందాల్సిన ప్రభుత్వ సాయం వచ్చే విధంగా ప్రత్యేక అధికారిని నియమిస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



పద్దం చంటి

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం గానుగపాడు గ్రామంలో పద్దం చంటి(29) చెరువులో మునిగి సోమవారం మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని నల్లచెరువులో చేపలవేటకు మరో ఇద్దరితో కలిసి వెళ్లిన చంటి నీటిలోకి దిగాడు. లోతైన ప్రదేశంలోకి వెళ్లడంతో చంటి మునిగిపోయి మృతి చెందాడు. తోటివారి సమాచారంతో గ్రామస్థులు, కుటుంబీకులు మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి...

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గౌరవరం గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లింగాపురం గ్రామానికి చెందిన మట్టా వీరయ్య(45) గౌరవరంలోని తన అక్క ఇంటికి ఆదివారం ఉదయం సమయంలో వెళ్లి పొలంలో కలుపు మందు పిచికారీ చేశాడు. అనంతరం మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులో ఉన్న చెరువులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటి లోతును అంచనా వేయలేక మునిగిపోయి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.1.42 కోట్లకు మిర్చి వ్యాపారి ఐపీ

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన మిర్చి వ్యాపారి పొన్నెబోయిన శ్రవణ్ కుమార్ రూ.1,42,00,000లకు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. మొత్తం ఏడుగురు రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిషనర్ శ్రవణ్ కుమార్ 'కార్తికేయ ఎంటర్‌ప్రైజెస్' పేరుతో 2018 నుంచి ఖమ్మంలో మిర్చి వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. కొవిడ్‌తోపాటు ఇతర కారణాల వల్ల వ్యాపారంలో నష్టాలు వచ్చాయని, తనను దివాలాదారుగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది జె.పాపారావు ద్వారా ఐపీ దాఖలు చేశారు.

రూ.29.64 లక్షలకు మరొకరు..

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం గాంధీచౌక్‌కు చెందిన మిర్చి వ్యాపారి పిల్లిగుండ్ల సురేశ్ రూ.29,64,355లకు స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం ఐపీ దాఖలు చేశారు. మొత్తం ముగ్గురు రుణదాతలను ప్రతివాదులుగా చేర్చారు. కేసు వివరాల ప్రకారం.. పిటిషనర్ సురేశ్ 2018 నుంచి ఖమ్మంలో మిర్చి వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం ప్రతివాదుల వద్ద అప్పులు తీసుకున్నారు. కొవిడ్‌తోపాటు ఇతర కారణాల వల్ల నష్టాలు వచ్చాయని, తనను దివాలాదారుగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది జె.పాపారావు ద్వారా ఐపీ దాఖలు చేశారు.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు కేసులో ఖమ్మం నగరానికి చెందిన బి.సోమయ్యకు ఆర్నెల్ల జైలు శిక్షతోపాటు ఫిర్యాదుదారుడికి రూ.10 లక్షలు చెల్లించాలని ఆదేశిస్తూ స్థానిక ప్రధాన ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె.దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం నగరానికి చెందిన ఫిర్యాదుదారు వంగారు నాగబాబు.. న్యాయవాది ఎస్‌కే. హైదర్ అలీ ద్వారా దాఖలు చేసిన కేసులో ఈ తీర్పు వెలువరించారు.

ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రి చూడముచ్చటగా కనిపించారు. సీతమ్మకు యోక్త్రధారణ రామయ్యకు యజ్ఞోపవీతధారణ కనుల పండువగా సాగింది. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రూ.లక్ష పైబడి విరాళం అందించిన దాతలకు స్వామివారి ప్రసాదం అందించి మంగళవారం సన్మానించనున్నారు.

ప్రాణం తీసిన సైకిల్ సవారీ

కడుపు భాగంలో హ్యాండిల్ తగిలి బాలుడి మృతి

మధిర పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు కావటంతో స్నేహితుణ్ని ఎక్కించుకుని సరదాగా సైకిలు తొక్కుతున్న ఓ బాలుడు ప్రమాదవశాత్తు కిందపడి అస్వస్థతకు గురై మృత్యువాత పడ్డాడు. మధిర పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.. మహదేవపురం గ్రామానికి చెందిన కనపర్తి నారాయణ ఆటో డ్రైవర్. ఇతనికి కుమారుడు మనోజ్‌కుమార్(14), కుమార్తె సంతానం. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే మనోజ్ తొమ్మిదో తరగతి, అతని చెల్లి ఏడో తరగతి చదువుతున్నారు. దసరా సెలవులు కావటంతో ఈనెల 11న మనోజ్ సైకిల్‌పై తన స్నేహితుడు విక్కీని వెనక కూర్చోబెట్టుకుని తొక్కుతున్నాడు. వేగంగా వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈ సమయంలో కడుపు హ్యాండిల్ బలంగా గుద్దుకోవటంతో అంతర్గత గాయాలయ్యాయి. నొప్పి తీవ్రం కావటంతో 12న మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. స్కానింగ్ చేసిన వైద్యులు ఖమ్మం తీసుకెళ్లాలని సూచించారు. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో అదే రోజు బాలునికి శస్త్రచికిత్స చేశారు. పరిస్థితి విషమించి 13న సాయంత్రం బాలుడు చనిపోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంధ్య తెలిపారు.

జూలూరుపాడు అటవీరేంజిలో పులి సంచారం

శునకాన్ని లాక్కెళ్లి ఆరగించినట్లు నిర్ధారణ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడు అటవీ రేంజి పరిధిలో పెద్దపులి సంచారం వాస్తవమేనని అటవీ శాఖ అధికారులు తేల్చారు. కొద్ది రోజులుగా స్థానికంగా పులి సంచరిస్తుందనే విషయంపై పలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్న నేపథ్యంలో తొలుత అటవీ అధికారులు పులికాదంటూ కొట్టిపారేశారు. సోమవారం జూలూరుపాడు అటవీరేంజి పరిధిలోని మున్యాతండా పంట పొలాల్లో పాదముద్రలను ఎఫ్ఆర్వో ప్రసాదరావు, సిబ్బంది వెళ్లి పరిశీలించారు. 90 శాతం పులి అడుగులను పోలి ఉన్నాయని, పెద్దపులిగానే భావించి ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఓ రైతు శునకాన్ని పొలం వద్ద కట్టేసి ఉంచగా దాన్ని గుట్టపైకి లాక్కెళ్లి తినేసిందని తెలిపారు. దీని ఆధారంగా జూలూరుపాడు-తల్లాడ అటవీ రేంజి ప్రాంతంలో అది సంచరిస్తున్నట్లు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళ పొలాల వైపు వెళ్లొద్దని గ్రామాల్లో చాటింపు వేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రేంజిల సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తూ దాని కదలికలపై పది రోజులపాటు నిఘా పెడుతున్నామని, ప్రజలెవరూ దానికి హాని తలపెట్టొద్దన్నారు. తనకు ప్రమాదమని భావించిన సందర్భంలో పులి దాడికి పాల్పడే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు.




గుర్తించిన పాదముద్ర



పులి సంచరించిన పొలాల్లో అటవీ అధికారులు, సిబ్బంది పరిశీలన

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,500	7,000	6,700
పెసలు	4,000	7,350	7,350
కందులు	7,000	7,000	7,000
ఏసీ ఎండుమిరప	14,700	19,000	17,500
ఎండుమిరప	13,000	19,700	15,000
తాలుమిరప	6,000	11,000	10,000

'మండలాధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

కరకగూడెం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ కరకగూడెం మండలాధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్‌పై సొంత పార్టీ నాయకులే అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సమత్ కమిటీ సభ్యులు, బబ్బులపల్లి ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుచ్చయ్య, వెంకన్న అన్నారు. కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న తమకు ఇందిరమ్మ కమిటీలో స్థానం కల్పించిన మండలాధ్యక్షుడిపై అసత్య ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో సాగర్, వెంకటేశ్వర్లు, రామనాథం, మల్లయ్య పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అన్నపురెడ్డి పల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

వైభవంగా అమ్మవార్ల శోభాయాత్ర

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న అమ్మవార్లకు అశ్వారావుపేటలో సోమవారం శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, యువత నృత్యాలతో సాగిన శోభాయాత్రతో ప్రత్యేక సందడి నెలకొంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033



సమస్య: భద్రాచలంలోని కొత్త బీసీఎం కార్యాలయం ఎదుట ఎంపీసీ కాలనీకి వెళ్లే రోడ్డులో పైపులైను లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకుని లీకేజీ అరికట్టాలి. **రామారావు, భద్రాచలం**

సమాధానం: లీకేజీని పరిశీలించి చర్యలు చేపడతాం. - **బ్రహ్మదేవ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి డీఈఈ, భద్రాచలం**
- భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

మండల వ్యాప్తంగా పలు చోట్ల విద్యుత్తు తీగలను చెట్ల కొమ్మలు తాకడంతో గాలి దుమ్ము వచ్చిన సమయంలో విద్యుత్తు అంతరాయం కలిగి వినియోగదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. - **స్థానికులు**

✔ త్వరలోనే చెట్ల కొమ్మలు తొలగించి ప్రజలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపడతాం. **మోహన్‌రెడ్డి, విద్యుత్తు శాఖ ఏఈ**
- దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

మండల పరిధిలోని మారుమూల బూరుగుపాడులో వీధి దీపాలు వెలగడం లేదు. అసలే అటవీ గ్రామం కావడంతో చీకటి పడితే బయటకు రాలేక పోతున్నాం. కీకారణ్య గ్రామం కావడంతోనే మా గ్రామంలో వీధి దీపాల ఏర్పాటులో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- **సోమయ్య, గ్రామ ఆదివాసీలు**

✔ ఈ సమస్య నా దృష్టికీ వచ్చింది. తప్పని సరిగా వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.
- **దయాకర్, పంచాయతీ కార్యదర్శి**
- చర్ల, న్యూస్‌టుడే

అశ్వారావుపేట మండలం నారాయణపురం- బచ్చువారిగూడెం మార్గంలో ఇటీవల వరదలకు పొలాలు కొట్టుకపోగా మిగిలిన భూమిలో వరిసాగు చేస్తున్నాము. రెండు రోజుల కిందట అధికారులు కల్వర్టు వద్ద రోడ్డుకు అడ్డుగా పైపు ఏర్పాటుచేయకుండా మట్టి పోయడంతో పొట్టదశలో ఉన్న వరి పొలం నీట మునిగింది. సమస్యను పరిష్కరించాలి. - **చిన్నంశెట్టి కృష్ణార్జునరావు, నారాయణపురం**

✔ సమస్య మా దృష్టికి వచ్చింది. జేసీబీ నిర్వాహకుడు తెలియకుండా తూర పెట్టకుండానే మట్టిపోశారు. వెంటనే అడ్డుగా ఉన్న మట్టి తొలగించి తూర ఏర్పాటు చేస్తాము.
- **శ్రీనివాస్, ర.భ.శాఖ డీఈఈ**
- అశ్వారావుపేట, న్యూస్‌టుడే

గిరిజన రైతులకు విద్యుత్తు మోటార్లు: జలగం

దుమ్ముగూడెం, చర్ల, న్యూస్‌టుడే: జలగం వెంగళరావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రైతులను ఆదుకుంటామని మాజీ మంత్రి జలగం ప్రసాదరావు అన్నారు. చినబండిరేవు గ్రామంలో ఆయన సోమవారం పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. మన్యం ప్రాంతంలో గిరిజన రైతుల అభ్యున్నతికి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సాగునీటి సదుపాయానికి ఉచితంగా మోటార్లను అందిస్తున్నామని వివరించారు. ఇప్పటి వరకు దుమ్ముగూడెం, చర్ల మండలాల్లోని గిరిజన రైతులకు దాదాపు 400 మోటర్లను అందజేశామని, ఈ ఏడాది మరో వెయ్యి మోటార్లు అందజేస్తామని తెలిపారు. చర్లలో సీపీకేశవ నివాసంలో జరిగిన గిరిజన రైతుల సమావేశంలోనూ ఆయన మాట్లాడారు. తిప్పాపురం చెరువు గండి పడిన అంశాన్ని రైతులు ఆయన దృష్టికి తేగా పూడ్చివేతకు రూ. 1.50లక్షలు ఇస్తామని ప్రకటించారు. నర్సింగ్ చదివే ఏజెన్సీ ప్రాంత గిరిజన విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా సాయం అందిస్తామన్నారు. కుర్నపల్లి, బోదనెల్లి గ్రామాల్లోనూ ఆయన పర్యటించారు. న్యాయవాది సీహెచ్ సతీశ్‌కుమార్, విద్యుత్తుశాఖ ఏఈలు యోహాన్, మోహనరెడ్డి, నాయకులు సాగి శ్రీనివాసరాజు, మురళీ, వెంకట్రావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

అయ్యో రామా.. వీరి తీరు కనుమా..?



భద్రాచలం, న్యూస్‌టుడే

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం భక్తులకు భూలోక వైకుంఠంగా కనిపిస్తుండగా.. ఇక్కడి ఉద్యోగులు వ్యవహరించే తీరు వివాదాలకు కారణంగా మారుతోంది. 'అంతా మా ఇష్టం' అనే ధోరణి వల్ల అభివృద్ధి పనులపై ఎలాంటి ప్రభావం పడుతుందోనన్న ఆందోళన నెలకొంది. ఆర్థిక లావాదేవీలలో అక్రమాలకు పాల్పడ్డారనే అభియోగంతో ఇటీవల నలుగురు కార్యాలయం ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆలయంలో విధులు నిర్వహించే వైదిక సిబ్బంది దేవాదాయశాఖ నియమాలను విస్మరిస్తే ఇదే తరహా చర్యలు ఉంటాయా? లేదా? అన్నది సర్వత్రా చర్చకు దారితీస్తోంది.

కేసు దాచి ఉంచారని..

ఇటీవల రామాలయం ప్రధానార్చకుడు సీతారామానుజాచార్యులు, అర్చకుడైన ఆయన కుమారుడు సీతారాం ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన ఖగోళయాత్ర కార్యక్రమానికి వెళ్లారు. విదేశాలలో భద్రాచలం రాముడి పేరుతో కల్యాణాలు నిర్వహించారు. ఆ నిర్వాహకులు నిధులు వసూలు చేశారన్న విమర్శలు వచ్చాయి. ప్రయివేటు వ్యక్తులు ఈ తతంగం చేస్తున్నా ఈ ఇద్దరు వైదిక ఉద్యోగులు రామాలయం అధికారులకు సమాచారం అందించలేదు. ఈ గొడవ జరుగుతున్న సమయంలోనే వీరిపై మరో వివాదం తెరపైకి వచ్చింది. తనను తన మామ సీతారామానుజాచార్యులు వేధిస్తున్నట్లు ఇతని కుమారుడు భార్య ఆమె స్వగ్రామమైన తాడేపల్లిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై కేసు నమోదైనా దీన్ని దాచి ఉంచడంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ప్రధానార్చకుణ్ని, అర్చకుణ్ని ఈఓ సస్పెండ్ చేశారు.

అభివృద్ధిపై ప్రభావం పడకుండా..

రామాలయ మాడవీధుల విస్తరణకు రూ.60.20 కోట్లు మంజూరు కావడంతో అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న 46 ఇళ్లను తొలగించేందుకు ప్రస్తుతం చర్యలు మొదలయ్యాయి. ఈ పని పూర్తయితే భారీగా నిధులు వచ్చే వీలుంది. ఆరోపణలకు, వివాదాలకు తావు లేకుండా అందరూ నియమబద్ధంగా ఉండేలా చూడగలిగితేనే ఆలయ అభివృద్ధి సాధ్యమని భక్తులు పేర్కొంటున్నారు.

అన్నీ తెలిసిన వారే ఇలా చేస్తే..!

స్థానాచార్యులు స్థలసాయి, వేద పండితుడు మురళీకృష్ణమాచార్యులు వైదిక బృందానికి పెద్ద దిక్కు. వీరిద్దరికి రామాలయ ఉత్సవాలపై విశేషమైన పట్టు ఉంది. మాసోత్సవాలు, వార్షికోత్సవాల ఏ తేదీలలో ఉంటాయో పూర్తిగా తెలుసు. విజయదశమి మహోత్సవాల సందర్భంగా రామాలయంలో రోజుకో రూపంలో అమ్మవారి అలంకారాలు ఉన్నాయి. ప్రతిరోజు రామాయణ పారాయణం నిర్వహిస్తారు. ఇలాంటి సమయంలో సెలవు ఇవ్వడం కుదరని ముందుగానే ఈఓ అందరికీ కలిపి ఉత్తర్వులు జారీ చేశారు. ఈఓ ఆదేశాలను బేఖాతరు చేసిన వీరిద్దరూ దసరా మహోత్సవాల సమయంలో రెండ్రోజుల పాటు గైర్హాజరయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించే ఉత్సవాలకు వేర్వేరుగా వెళ్లి ప్రవచనాలు చేశారు. సెలవు ఇవ్వడం కుదరని చెప్పినా.. సెలవు తీసుకుని పంతం నెగ్గించుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది వివాదం కావడంతో మెమోలు జారీ చేశారు. వీరిచ్చే సమాధానంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

'ఇందిరమ్మ కమిటీల ఎంపిక రాజ్యాంగ విరుద్ధం'

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అచ్యుతాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి స్రవంతి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈనేపథ్యంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు సోయం కామరాజు, కుర్సం రవి, మిచ్చా దుర్గారావు, సోయం నాగరాజు సమావేశం వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేసి అడ్డుకున్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో ఇందిరమ్మ కమిటీల ఎంపిక రాజ్యాంగ విరుద్ధమన్నారు.

నేడు పొంగులేటి పర్యటన.. జయప్రదానికి పిలుపు

అశ్వాపురం, న్యూస్‌టుడే: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యాహ్నం నిర్వహించే నియోజకవర్గ పర్యటనను జయప్రదం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య కోరారు. సోమవారం ఆయన అశ్వాపురంలో విలేకరులతో మాట్లాడారు. బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరులో పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాల నూతన భవనాలను ప్రారంభిస్తారన్నారు. మణుగూరులో బాలికల ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం పీవీ కాలనీలోని సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు.

అశ్వారావుపేటలో భారీ వర్షం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేటలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం అనుకోకుండా ఎలాంటి ఉరుములు, మెరుపులు లేకుండా భారీ వర్షం గంటపాటు కురవడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. రోడ్లపైకి భారీగా వరదనీరు చేరింది. ఖమ్మం- రాజమండ్రి మార్గంలో జాతీయ రహదారి పక్కనే మురుగునీటి కాలువల నిర్మాణం చేస్తుండటం, జేసీబీతో కందకాలు తవ్వి ఆ మట్టిని రోడ్డుపక్కన పోయడంతో ఆ ప్రాంతం బురదమయంగా మారింది.

గిరిజనులకు పోడు పట్టాలివ్వాలి

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని కొండాయిగూడెంలో పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఉమర్ డిమాండు చేశారు. పోడు సాగుదారులతో కలిసి తహసీల్దారు జగదీశ్వరప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు.

'వర్గీకరణ వ్యతిరేక బహిరంగ సభ..'

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఏ. పౌల్‌రాజ్ అన్నారు. స్థానిక ఆదర్శనగర్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు శివ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై త్వరలో నిర్వహించే భారీ బహిరంగ సభకు వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డీఈఈ

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం పంచాయతీరాజ్ డీఈఈ సైదుల్‌రెడ్డి పరిశీలించారు. చంద్రుగొండ జడ్పీ పాఠశాలలో మురుగు కాలువ పనులు, విద్యుత్తు ఉప కేంద్రం ముందు సీసీ రోడ్డు నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేయాలని ఆయన సూచించారు.

ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాలి

ములకలపల్లి, న్యూస్‌టుడే: తిమ్మంపేట ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. తిమ్మపేట శివారులోని ఎత్తిపోతల పంపుహౌస్‌ను ప్రజాపంథా జిల్లా నాయకుల బృందం సోమవారం పరిశీలించింది. పంపుహౌస్‌ను వెంటనే ప్రారంభించి 5 గ్రామాల రైతులకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. నూపా భాస్కర్, కిషోర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి'

ములకలపల్లి, న్యూస్‌టుడే: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ములకలపల్లిలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు. రాంబాబు, రావూజ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన

అశ్వాపురం, న్యూస్‌టుడే: గౌతమీనగర్‌లో సోమవారం స్వచ్ఛత ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించారు. గౌతమీనగర్‌లోని పలు ప్రదేశాలను, గౌతమీనగర్ బస్టాప్ పరిసరాలను శుభ్రం చేశారు. డీజీఎంలు హెచ్‌కె శర్మ, జగన్నాథశర్మ, ఐఆర్‌ఓ లత, ఏపీఓ కేశవరావు, ఎస్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు విస్తృత తనిఖీలు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పట్టణంలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు చేశారు. గంజాయి, ఇతర అనుమానిత వస్తువులు పసిగట్టేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. బస్టాండు, భద్రాచలం మార్గం, సినిమా హాలు బజారుల్లో తనిఖీలు చేశారు. ప్రొబేషనరీ ఎస్ఐ విజయ్, డాగ్ స్క్వాడ్ కానిస్టేబుల్ శివశంకర్ ఉన్నారు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో రూ. 3లక్షల విలువైన సొత్తు చోరీ ఘటన అశ్వారావుపేటలో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని బీఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న వి.మురళి దసరా పండగకు రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి అచ్యుతాపురంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. ఆదివారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని మూడు కాసుల బంగారు హారం, 750గ్రాముల వెండి వస్తువులు, చీరలను దొంగలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కొత్తగూడెం నుంచి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ చోరీ ఘటనపై కేసు నమోదు చేయలేదని ఎస్సై యయాతి రాజు తెలపడం గమనార్హం.

వ్యవసాయ విస్తరణ అధికారుల బదిలీ

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం, మొండికుంట, తుమ్మలచెరువు క్లస్టర్‌ల వ్యవసాయ విస్తరణ అధికారులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో నూతనంగా అశ్వాపురం క్లస్టర్‌కు టి.రవితేజరెడ్డి, మొండికుంట క్లస్టర్‌కు బి.రమాదేవి, తుమ్మలచెరువు క్లస్టర్‌కు బి.రవికుమార్ వ్యవసాయ విస్తరణాధికారులుగా నియమితులయ్యారు.

'స్నేహితుడికి చేయూత'

చర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఐతం రమేశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న 1998 బ్యాచ్ పదో తరగతి మిత్రులు అతని వైద్య ఖర్చుల కోసం రూ.35వేలను సోమవారం అందించి స్నేహితుని కుటుంబానికి బరోసా ఇచ్చారు.

గోదారి చెంత.. అమ్మోరి చింత..!



విజయదశమి సందర్భంగా మండపాలలో నవరాత్రి పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాలను ఆదివారం భద్రాచలం గోదావరిలో నిమజ్జనం చేశారు. పడవల సాయంతో గజ ఈతగాళ్లు ఈ ప్రతిమలను ప్రవాహంలో వదిలారు. నిమజ్జనం చేసే సమయంలో 15 అడుగులు ఉన్న నీటిమట్టం క్రమంగా తగ్గుతు సోమవారం సాయంత్రానికి 13.8 అడుగులకు చేరింది. దీంతో సరైన లోతు లేకపోవడంతో భారీ బొమ్మలు ఒడ్డుకు చేరి బురదలో కూరుకుని నీటిలో సగమే మునిగి కనిపిస్తున్నాయి. ఇది మనోభావాలకు సంబంధించిన అంశం కావడంతో ఇరిగేషన్, గ్రామ పంచాయతీ, రామాలయం అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని భక్తులు పేర్కొంటున్నారు. పడవలు గజ ఈతగాళ్ల సాయంతో వీటిని లోతుకు తీసుకెళ్లి నీటిలో వదలాలని కోరుతున్నారు. - భద్రాచలం, న్యూస్‌టుడే

బావి పరిసరాలు శుభ్రం

చర్ల, న్యూస్‌టుడే: పాత చర్లలోని అభయాంజనేయ స్వామి ఆలయం పక్కన ఉన్న తాగునీటి బావి పరిసరాలు చెత్తా చెదారంతో నిండి ఉండటంపై ఈనెల 6న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమవడంతో ఈవో సురేశ్ స్పందించారు. పంచాయతీ సిబ్బందితో సోమవారం బావి పరిసరాలను శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి: ఏపీఓ జనరల్

భద్రాచలం, న్యూస్‌టుడే: దసరా సెలవులు పూర్తి కావడంతో విద్యాలయాలకు వచ్చే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ ఆదేశించారు. వాతావరణంలో మార్పుల వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే వీలుందని దీన్ని సంక్షేమ అధికారులు ఉపాధ్యాయులు గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జునరావు, ఎస్డీసీ రవీంద్రనాథ్‌లతో కలిసి సోమవారం ఐటీడీఏలో దర్బారు నిర్వహించారు. గిరిజనులు అందించిన వినతులు స్వీకరించి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపారు. భూములకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వస్తున్నందున నిబంధనల మేరకు తొందరగా పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ అవసరాలకు దరఖాస్తులు వస్తున్నందున విద్యుత్తు సదుపాయం, మోటార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్హులకు ఆర్థిక సాయం, ఉపాధి అవకాశాలను అందించాలని తెలిపారు.



దర్బారులో సమస్యలు వింటున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

విధుల్లో చేరిన నూతన అధికారులు..

✦ ఐటీడీఏలోని అటవీహక్కుల చట్టం (ఆర్వోఎఫ్ఆర్) విభాగం డీటీగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన శ్రీనివాస్‌కు కొత్తగూడెం బదిలీ అయింది. ఈ స్థానంలోకి కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఎం.లక్ష్మీనారాయణకు బదిలీ అయింది. ఈయన సోమవారం విధుల్లో చేరారు.

✦ ఐటీడీఏ విద్యుత్తు విభాగంలో ఏపీఓ పవర్ పోస్టులో టి.వేణు చేరారు. భద్రాచలం ట్రాన్స్‌కో ఏడీఈగా పని చేస్తున్న ఆయన ఐటీడీఏకు బదిలీ అయ్యారు. ఏఈ మునీర్‌పాషా దాదాపు రెండేళ్ల నుంచి ఇంఛార్జి ఏపీఓ పవర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక నుంచి మునీర్ పాషా ఏఈగా కొనసాగనున్నారు.

'కాసం ఫ్యాషన్స్' బంపర్ డ్రా విజేతల ప్రకటన

భద్రాచలం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవంలో భాగంగా భద్రాచలం యూబీ రోడ్డులోని కాసం ఫ్యాషన్స్ వారు 'ప్రతిఊరికి ఒకబైక్' బంపర్‌డ్రాను సోమవారం తీశారు. రాంపురానికి చెందిన అనిత (కూపన్ నంబర్ సీఏ31063665/10/24) విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

సమగ్ర విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

బూర్గంపాడు, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ సాగర్ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సమగ్రంగా విచారణ చేపట్టాలని భాజపా జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. బూర్గంపాడు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని సూచించారు. దందాలకు పాల్పడేవారిని ప్రక్షాళన చేయాలని కోరారు. కొందరు పోలీసులు అధికార పార్టీ నాయకుల చెప్పుచేతల్లో ఉంటున్నారని విమర్శించారు. పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏనుగుల వెంకటరెడ్డి, గుగులోత్ బాలునాయక్, బీరక సాయిశ్రీను, చుక్కపల్లి బాలాజి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు. ✦ పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన కానిస్టేబుల్ సాగర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఆత్మహత్య ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి బాధ్యులను శిక్షించాలని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సూచించారు.

ఇసుక వాహనాలపై నిఘా పెంపు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి పాయింట్ వద్ద మైనింగ్ శాఖ అధికారుల బృందం సోమవారం నుంచి నిఘా పెంచింది. ఇటీవల ఏజెన్సీలో లారీలు నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు(వరంగల్) రూట్‌వాచ్‌లో భాగంగా భద్రాచలం వచ్చారు. ఈ ప్రాంతంలో ఏపీ ర్యాంపుల నుంచి ఇసుక భద్రాచలం మీదుగా వస్తుందో మైనింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా మూడు రోజుల క్రితం భద్రాచలం వద్ద పట్టుకున్న మూడు ఇసుక లారీలకు రెవెన్యూ అధికారులు ఎటువంటి అనుమతులు లేని కారణంగా రూ.1.50 లక్షల జరిమానా విధించారు.



బ్రిడ్జి పాయింట్ చెక్‌పోస్టు వద్ద మైనింగ్ శాఖ అధికారుల బృందం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అశ్వాపురం, న్యూస్‌టుడే: నెల్లిపాక పీఏసీఎస్ పరిధిలోని మల్లెలమడుగులో సోమవారం పీఏసీఎస్ ఛైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

చర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పెదమిడిసిలేరులో జీసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జీసీసీ మేనేజర్ జయరాజ్ ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఇక్కడ విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. క్వింటా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500ల బోనస్ చెల్లిస్తుందన్నారు. కేంద్రం ఇన్‌ఛార్జి బెండబోయిన సంతోశ్, రైతులు పాల్గొన్నారు.



మల్లెలమడుగులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ(అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్)లో చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రధానోపాధ్యాయుడు బడుగు ప్రభాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఐటీఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత స్థానిక ఐటీఐ కళాశాలకు వచ్చి ఒరిజినల్ ధ్రువపత్రాలతో ప్రవేశం పొందాలన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవెంకటపురం గ్రామానికి చెందిన మొక్కటి కోస(22) తండ్రి అడమయ్య మందలించారన్న మనస్తాపంతో గతవారం పురుగు మందు తాగాడు. కొత్తగూడెం వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: కిచ్చెనపల్లి గ్రామానికి చెందిన పడిగ పావణి భర్త సుమన్ సోమవారం గొడవపడ్డారు. ఆ మనస్తాపంతో పావణి ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగు మందు తాగడంతో ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు: సారపాకలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బూర్గంపాడు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా ఆక్రమణలు.. ఆపై అద్దెలకు..!

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే

భద్రాచలం పట్టణంలో అధిక శాతం మంది చిన్నిచిన్న బడ్డీ దుకాణాలు తయారు చేయించి ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించారు. ఆ దుకాణాలను వారు నిర్వహించుకోకుండా అద్దెలకు ఇచ్చి వేలల్లో వసూలు చేసుకుంటున్నారు. ఫుట్‌పాత్‌పై ఎక్కడ చిన్న ఖాళీ జాగా దొరికినా అది వారికి ఆదాయ వనరుగా మారింది. కొందరైతే ఏకంగా వీటికి అడ్వాన్సులుగా రూ.20 నుంచి 50 వేల వరకు వసూలు చేసి మరీ అద్దెలకు ఇస్తున్నారు. పట్టణంలో చిరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపై చిన్న వ్యాపారాలు చేసుకొని జీవించడం పారిపాటి. రోజు వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు మాత్రం వారి కుటుంబం గడవడం అటుంచితే యజమానికి నెలకు చెల్లించాల్సిన అద్దె, విద్యుత్ ఛార్జీలకే తమ సంపాదన సరిపోతోందని వాపోతున్నారు. అసలే దుకాణాలు అధికం కావడంతో పట్టణంలో ఆయా ప్రాంతాలను బట్టి వ్యాపారం అంతంత మాత్రమేనని, వ్యాపారానికి తీసుకున్న అప్పు అలాగే మిగిలిపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి చిరుదుకాణాలు ఏర్పాటుచేసి అద్దెలకు ఇచ్చే వారిపై దృష్టి సారించాల్సి ఉంది. దీనిపై గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావును వివరణ కోరగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.



కూనవరం రోడ్డులో ఫుట్‌పాత్‌పై దుకాణాలు

బ్యాంకు ఖాతా హోల్డ్‌లో ఉంచారని.. పెట్రోల్ పోసుకుని..

ములకలపల్లి, న్యూస్‌టుడే: బ్యాంకు ఖాతాను హోల్డ్‌లో ఉంచారని ఒంటిపై పెట్రోల్ పోసుకున్న ఘటన ములకలపల్లి ఏపీజీవీ బ్యాంకు వద్ద సోమవారం చోటు చేసుకుంది. వివరాలను పరిశీలిస్తే.. మండలంలోని మోటుగూడేనికి చెందిన బుడిపూడి సుజాతకు స్థానిక ఏపీజీవీ బ్యాంకులో ఖాతా ఉంది. ఆమె తన ఖాతాలోని రూ. 10వేల నగదు తీసుకునేందుకు భర్త వెంకటేశ్వర్లుతో కలిసి బ్యాంకుకు వచ్చారు. ఖాతా హోల్డ్ ఉందని, నగదు ఇవ్వడం కుదరదని బ్యాంకు అధికారులు చెప్పడంతో తమకు బ్యాంకులో ఎలాంటి రుణం లేదని, ఖాతాను ఎలా హోల్డ్‌లో పెడతారంటూ వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుంటానంటూ హెచ్చరించాడు. దీంతో అతడిని అక్కడి వినియోగదారులు అడ్డుకున్నారు. ✦ ఈ ఘటనపై బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ రమేశ్ వివరణ ఇస్తూ సుజాతకు సంబంధించి డ్వాక్రా గ్రూప్ లింకేజీ రుణం ఉన్నట్లు గ్రామదీపిక తెలపడంతో ఖాతాను హోల్డ్‌లో పెట్టామని, అయితే శ్రీనిధి రుణం మాత్రమే ఉండటంతో పరిశీలించి ఖాతాను హోల్డ్ నుంచి తొలగించామన్నారు.

ఆర్టీసీ ప్రయాణానికి.. అగచాట్లేనా..?

చంద్రుగొండ, న్యూస్‌టుడే

దసరా పండుగకు పలు పట్టణాల నుంచి వచ్చిన ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొత్తగూడెం నుంచి చంద్రుగొండ మీదుగా హైదరాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సును రద్దు చేశారు. చంద్రుగొండ ఆర్టీసీ బస్టాండులోకి బస్సులు రాకపోవటంతో ప్రధాన సెంటర్లో ఎండలోనే ప్రయాణికులు నిరీక్షించాల్సి వస్తోంది. ఇటీవల కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ చంద్రుగొండ వచ్చినప్పుడు బస్టాండుని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంత వరకు ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదు. బస్టాండు ఆవరణ అంతా గుంతలమయంగా మారింది. బస్టాండులో తాగునీటి సౌకర్యం లేదు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. బస్టాండు ఆవరణ అంతా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండుని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



చంద్రుగొండలో ప్రయాణికుల రద్దీ

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

పాఠ్యపుస్తకాలు సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందజేసే పాఠ్యపుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. పాతకొత్తగూడెం పాఠ్యపుస్తకాల కేంద్రంలో సోమవారం పార్ట్-2 పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,43,200 పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. పంపిణీ ఐదు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఎంఈఓ ప్రభుదయాళ్, ఏఎంఓ నాగరాజశేఖర్, మేనేజర్ రవిప్రతాప్, ఇన్‌ఛార్జి అప్పారావు పాల్గొన్నారు.



పాఠ్య పుస్తకాలను అందిస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

పతకాలు సాధించిన అధికారులకు సన్మానం

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఇటీవల జరిగిన జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో బంగారు పతకాలు సాధించిన వన్‌టౌన్, టూటౌన్ ఎస్‌హెచ్‌ఓలు ఎం.కరుణాకర్, రమేశ్‌లను అభ్యుదయ కళాసేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం శాలువాలతో సత్కరించారు. సామాజిక సేవ అందించడమే కాకుండా క్రీడల్లోనూ రాణించి పతకాలు సాధించడంతో ప్రశంసించారు. అధ్యక్షుడు మద్దెల శివకుమార్, సైమన్, సుధాకర్, నరేందర్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689



సమస్య: పాల్వంచ పట్టణం పున్నమి స్కూల్ రోడ్‌లో మురుగు కాలువలో పూడిక తీయకపోవడంతో మురుగు పారక దుర్వాసన తో ఇబ్బంది పడుతున్నాం. - వేదకుమారి, స్థానికురాలు

సమాధానం: ఆ ప్రాంత జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. - కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి పాల్వంచ, న్యూస్‌టుడే

✆ మండలంలోని అన్నారుపాడు ముత్యాలమ్మ కాలనీలో వర్షం పడితే చాలు రహదారిపై నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. - స్థానికుడు, అన్నారుపాడు, జూలూరుపాడు మండలం

✔ సంబంధిత పంచాయతీ కార్యదర్శిని పరిశీలనకు పంపి, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. - తులసీరాం, మండల పంచాయతీ అధికారి - జూలూరుపాడు, న్యూస్‌టుడే

అకౌంటెంట్ గది నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న న్యాయమూర్తులు భానుమతి, రామారావు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ప్రాంగణంలో అకౌంటెంట్ గది నిర్మాణానికి న్యాయమూర్తులు జి.భానుమతి, బి.రామారావు సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు అనుదీప్, రాంప్రసాద్‌రావు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామిశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబాకి నివాళి

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. హక్కుల సాధన కోసం ఉద్యమించిన ఆయన మృతి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. సాదిక్‌పాషా, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్పత్తి వ్యయం తగ్గితేనే సింగరేణికి మనుగడ

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి వ్యయం అంతకంతకూ పెరుగుతోంది. కోలిండియా సంస్థలైన మహానది కోల్‌ఫీల్డ్స్ (ఒడిశా), వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (మహారాష్ట్ర) కన్నా ఈ సంస్థ ఉత్పత్తిచేసే బొగ్గు ధర అధికంగా ఉంటోంది. రవాణా ఛార్జీల భారం కారణంగా రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది విద్యుత్తు సంస్థలు సింగరేణి పైనే ఆధారపడుతున్నాయి. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోకుంటే సింగరేణి మనుగడపై ప్రభావం పడుతుందని అధికార వర్గాల్లో వ్యక్తమవుతోంది. దీంతో పాటు గనుల్లోకి త్వరలో ప్రైవేటు సంస్థలు ప్రవేశించనున్న తరుణంలో సింగరేణికి మరింత పోటీ ఎదురుకానుంది. వచ్చే ఐదారేళ్లలో ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోక తప్పదనే వాదన వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా నల్లనేలలో చర్చనీయాంశంగా మారింది. కేంద్రం ప్రైవేటు సంస్థలకు బొగ్గు బ్లాకులను కట్టబెట్టే అంశం కార్మికుల అభద్రతాభావానికి కారణమవుతోంది.

స్ట్రిప్పింగ్ రేషియోలో వ్యత్యాసం

ఒక టన్ను బొగ్గును వెలికితీసేందుకు ఎంత మట్టి తొలగించాలనే దానిని స్ట్రిప్పింగ్ రేషియో'గా లెక్కిస్తారు. ఈ నిష్పత్తి కోలిండియాతో పోల్చితే సింగరేణిలో ఎక్కువ. అందువల్లే ఉత్పత్తి వ్యయం అధికమవుతోంది. కోలిండియాలో ఒక టన్ను బొగ్గు వెలికితీతకు 2.88 టన్నులు, అదే సింగరేణి గనుల్లో అయితే 6.2 టన్నుల మట్టి తొలగించాలి. మూడు రెట్ల మట్టిని తొలగించాల్సి రావడం, ఇదే క్రమంలో కార్మికుల వేతనాలు అధికంగా ఉండటం వల్ల ఖర్చులు ప్రియం అవుతున్నాయి.

ప్రైవేటు సంస్థల రాకతో మరింత సవాలే

ఇప్పటి వరకు భూగర్భ గనులు, ఉపరితల గనుల్లో బొగ్గును నిర్ణీత మొత్తానికి వెలికితీసే పనులకు పరిమితమైన ప్రైవేటు కంపెనీలు.. ఇకపై ఏకంగా వేలంలో బొగ్గు బ్లాకులనే పొందుతున్నాయి. ఏడేళ్ల క్రితం వరంగల్ జిల్లా తాడిచర్ల బొగ్గు బ్లాకును కేంద్రం ఓ ప్రైవేటు సంస్థకు కేటాయించడం కార్మికుల్లో పెద్దఎత్తున ఆందోళన వ్యక్తమైంది. దీంతో తన నిర్ణయాన్ని మార్చుకుని ప్రభుత్వం బ్లాకును సింగరేణికే కేటాయించింది. కానీ సింగరేణి ప్రాంతాల్లోనూ బొగ్గు బ్లాకులు వేలాన్ని రెండేళ్లుగా చేపట్టడంతో ప్రైవేటు సంస్థల వాటిని పొందే అవకాశం ఏర్పడింది. టేకులపల్లిలోని ఒక ఓసీని ఒక సంస్థ పొందిన విషయం తెలిసిందే. త్వరలో సింగరేణి సమీపంలోనే బయట కంపెనీలు పోటాపోటీగా బొగ్గును ఉత్పత్తి చేసి సింగరేణికన్నా తక్కువ ధరకే విక్రయించే అవకాశం ఉంది. దీనివల్ల గిరాకీ కూడా తగ్గే ప్రమాదం కూడా లేకపోలేదు.



రవాణాకు సిద్ధంగా ఉన్న సింగరేణి బొగ్గు (పాతచిత్రం)

బొగ్గు ధర టన్నుకు	సింగరేణిలో	మహానది, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో
జీ-5 గ్రేడు	రూ.5,685	రూ.2,970
జీ-16 గ్రేడు	రూ.1,620	రూ.614

యంత్రాలతో గరిష్ఠ ఉత్పత్తే లక్ష్యం

ప్రైవేటు సంస్థలతో పోటీ పడాలంటే ఉత్పత్తి వ్యయాన్ని మరింతగా తగ్గించాల్సి ఉంటుంది. వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉండటం వల్ల మట్టి తొలగింపు పనుల వ్యయంలో వ్యత్యాసం భారీగా ఏర్పడుతోంది. పనుల్లో మరింత క్రమబద్ధీకరణ చేకూరితేనే వ్యయం అదుపు సాధ్యమవుతుంది. దీనికి పరిష్కారంగా ఉద్యోగులు, అధికారులకు కొన్ని సూచనలు చేశాం. భారీ యంత్రాలు రోజుకు సగటున 15 నుంచి 16 గంటలు పనిచేస్తున్నాయి. దీన్ని కనీసం 20 గంటలకు పైగా పనిచేయించాల్సి ఉంటుంది. దీంతో 20 శాతం ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది. కార్మికులు, ఉద్యోగులు 8 గంటల సమయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రైవేటు కంపెనీల కన్నా మరింత సమర్థంగా కనబర్చి ఉత్పత్తి వ్యయాన్ని ఎలా తగ్గించవచ్చో కార్మికులు గమనించాలి. దుబారా నియంత్రణపై అధికారులు దృష్టిపెట్టాలి.

- ఎన్.బలరాం, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

చెత్త తొలగింపు

స్పందనకు వందనం


టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి దాసుతండా పంచాయతీ డంపింగ్‌యార్డులో రోడ్డు మీదకు చెత్త చేరి 'మేమున్నాం మీకు తోడుగా'లో సోమవారం ప్రచురితమైంది. టేకులపల్లి పంచాయతీ కార్యదర్శి దీప్తి స్పందించి చెత్తను పొక్లెయిన్ సహాయంతో రోడ్డు మీద ఉన్న చెత్తను లోపలికి నెట్టివేయించారు.

పండగ తర్వాత.. ప్రయాణానికి ప్రయాస




దసరా పండగకు పట్నం, ఇతర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన ప్రజలకు తిరుగు ప్రయాణంలో ప్రయాసలు తప్పలేదు. ఇల్లెందు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, డిపో ఆవరణలో బస్సుల కోసం ప్రయాణికులు గంటలకొద్దీ నిరీక్షించారు. సాధారణ పరిస్థితుల్లోనే ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు పండగ వేడుకల్లో అదనపు బస్సులు లేకపోవడం గమనార్హం. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.. మరికొందరు బస్సులను ఎక్కేందుకు వందల సంఖ్యలో పోటీపడ్డారు. బసుమితో ఇన్‌ఛార్జి సంజీవరావుని వివరణ కోరగా.. సోమవారం ఎనిమిది మంది డ్రైవర్లు విధులకు రాలేదని, పరిస్థితిని అధికారులకు తెలిపామన్నారు. - ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రకృతి అందాలు.. ఇంద్రధనుస్సు వర్ణాలు



చుట్టూ పచ్చని చెట్లు.. మధ్యలో పంట పొలాలు.. వాటిపై ఇంద్రధనుస్సు వర్ణాలు పడటంతో పచ్చని ప్రకృతికి తోడు రమణీయత సోయగాలు చూపరులను కట్టిపడేశాయి. డేగలమడుగు సమీపంలో పచ్చని పంట పొలాలపై ఇంద్రధనుస్సు ఏకంగా పొలం పైనే పరిచినట్టు కన్పించడంతో 'న్యూస్‌టుడే' సోమవారం క్లిక్‌మనిపించింది. - సుజాతనగర్, న్యూస్‌టుడే

మేఘాల కనువిందుకు వారధి!



కొత్తగూడెం-ఖమ్మం ప్రధాన రహదారి వేపలగడ్డ వద్ద ఇటీవల నిర్మించిన రైల్వే పై వంతెన మీద ప్రయాణం వాహనదారులకు నయనానందాన్ని కలిగిస్తోంది. ఆ వంతెన చాలా ఎత్తుగా ఉండటంతో చుట్టూ కొండలు, గుట్టలు కన్పిస్తుంటాయి. వాతావరణం ఒక్కసారిగా చల్లబడితే నీలం, తెలుపుతో కూడిన ఆకాశ మేఘాలు ఇలా కనువిందు చేస్తుండటంతో వాహనదారులు ఆస్వాదిస్తూ ప్రయాణాలు సాగిస్తున్న దృశ్యాన్ని 'న్యూస్‌టుడే' సోమవారం క్లిక్‌మన్పించింది. - చుంచుపల్లి, న్యూస్‌టుడే

హోటళ్లపై అధికారుల దాడులు.. ఐదుగురిపై కేసు

ఈనాడు కథనానికి స్పందన

టేకులపల్లి, న్యూస్‌టుడే: టేకులపల్లి వ్యాపార అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గుర్రం ప్రభాకర్ హెచ్చరించారు. ఈ నెల 7న 'రాయితీ గ్యాస్ పక్కదారి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. సోమవారం రాత్రి పౌరసరఫరాల అధికారులు హోటళ్లపై దాడులు నిర్వహించారు. ఐదుగురిపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు. వ్యాపార అవసరాలకు కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాలని సూచించారు.

'కాసం ఫ్యాషన్స్' బంపర్ డ్రా విజేత ప్రకటన


పాల్వంచ, న్యూస్‌టుడే: దసరా మహోత్సవంలో భాగంగా పాల్వంచ పట్టణం అంబేడ్కర్ సెంటర్‌లోని కాసం ఫ్యాషన్స్ వారు 'ప్రతి ఊరికి ఒక బైక్' బంపర్ డ్రాను సోమవారం తీశారు. మహోత్సవం బంపర్ డ్రా తీయగా.. విజేతగా రమాదేవి (కూపన్ నంబర్ సీఏ42045882/10/24) ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం ఉత్తర సెక్షన్ పరిధిలో జనమందర్ 33/11కేవీ విద్యుత్తు కేంద్రం పరిధిలోని విద్యుత్తు లైన్ మరమ్మతులు చేపడుతున్నందున మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పట్టణంలోని ఎంజీ రోడ్, పెద్ద బజార్, చిన్న బజార్, హాలీబీస్ట్, గాజులరాజం బస్తీ, సాయినగర్, ఐటీసీ గ్యాస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇల్లెందు పట్టణంలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. వడ్డెర బజారు, ఇందిరానగర్, సంజయ్‌నగర్, ఏజెన్సీ వైద్యశాల ఏరియా, సం.ఓబస్తీ, సీతారామ టాకీస్ వెనక, రాజా ఏరియా, శివాలయం ఏరియా, అంబజార్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు

పాల్వంచ, న్యూస్‌టుడే: పాతపాల్వంచ షిర్డీసాయిబాబా ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో 106వ పుణ్యతిథి ఉత్సవాల మహాసంగా నిర్వహించారు. ఆలయ పూజారి పురాణం సుమన్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకం, కాకడ హారతి తదితర పూజలు చేశారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు హాజరయ్యారు.

'కానిస్టేబుల్ కుటుంబానికి న్యాయం చేయండి'

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ భూక్యా సాగర్ నాయక్ ఆత్మహత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సేవాలాల్ సేన రాష్ట్ర కమిటీ నాయకులు ఎస్పీ బి.రోహిత్‌రాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, భార్యకు గ్రూప్-2 ఉద్యోగం, పిల్లలకు ఫ్రీ ఎడ్యుకేషన్ సదుపాయం కల్పించాలని కోరారు. ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రేమ్‌చంద్, బానోత్ శ్రీను పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళిక లేకనే ప్రయాణికుల ఇక్కట్లు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా పండగ రద్దీకి తగినట్లు ఆర్టీసీ అధికారులు ముందస్తు ప్రణాళిక చేపట్టకపోవడంతో బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు అబ్దుల్ నబీ తెలిపారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో తాళ్లూరు కృష్ణ, మోహన్‌రావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాజకీయ ఐకాస నాయకుల వినతి

టేకులపల్లి, న్యూస్‌టుడే: కేఓసీలో మట్టి, బొగ్గువెలికితీత పనులు నిర్వహిస్తున్న ఎల్ఎస్ఎన్ యాజమాన్యాన్ని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని టేకులపల్లి రాజకీయ ఐకాస కన్వీనర్ లక్కినేని సురేందర్ డిమాండ్ చేశారు. రాజకీయ ఐకాస ఆధ్వర్యంలో ఏరియా పర్సనల్ అధికారి, ఇల్లెందు డీఎస్పీ, కేసీసీ పీఓకు సోమవారం వినతిపత్రం అందజేశారు. యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆడుకుంటోందని, సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. డి.ప్రసాద్, దశ్‌సింగ్‌నాయక్, హర్షద్, వరప్రసాద్, వీరబ్రహ్మచారి పాల్గొన్నారు.

కరిగిపోతున్న కరిసెలబోరు..!

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: కరిసెలబోరు గుట్టను పట్టాదారుడు పొలం చదును పేరుతో తొలుస్తూ కొల్లగొడుతున్నారు. మండలంలోని యానంబైలు-మొండికట్ట మధ్యలో ఈ గుట్ట ఉంది. రెండు పొక్లెయినర్లతో తవ్వి యానంబైలు చెక్‌పోస్టు పడమర సమీపంలో లారీలతో మట్టిని తరలిస్తున్నారు. రోజుకు తవ్వుతుండటంతో విస్తీర్ణం తగ్గి కనుమరుగవుతోందని స్థానికులు వాపోతున్నారు. గతంలో వాగులు పొంగి ఇళ్లలోకి వరద రాకుండా ఆ గుట్టనే ఎక్కి తలదాచుకునేవాళ్లమని ప్రజలు చెబుతున్నారు. పగలు, రాత్రి గుట్టను తవ్వుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ఆనుకుని మట్టి ఏకరంగా తరలిస్తూ.. తోలకం పేరుతో స్థానికులను గుత్తేదారులు మభ్యపెట్టారు. వంతెన పూర్తయితే రాకపోకలు సాగించవచ్చని నమ్మించి ప్రజల్ని ఒప్పించారు. అర్ధరాత్రి కొండరు మట్టి మాఫియా రంగంలోకి దిగి పాల్వంచలో వెంచర్లకు రూ.3,500లకు మట్టి తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. అర్ధరాత్రి తరలిస్తుండటంతో ప్రజలకు సైతం తెలిసే పరిస్థితి లేదు. తహసీల్దార్ వివేక్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. మట్టి తవ్వడానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గుట్టను పొక్లెయిన్లతో తవ్వి లారీల్లో తరలిస్తున్న మట్టి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: వరంగల్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం సమీక్షా సమావేశానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కె.వి.రంగాకిరణ్, నియోజకవర్గ కన్వీనర్లు హాజరయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి జిల్లాలో జరుగుతున్న సభ్యత్వ నమోదు గురించి వివరించారు. అనంతరం ఆయనను సన్మానించి, వచ్చే నెల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు రావాలని ఆహ్వానించినట్లు వారు తెలిపారు. పానుశెట్టి వెంకటేశ్వర్లు, కుంజా ధర్మ, పోడియం బాలరాజు, గొట్టిపోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న నాయకులు



ఇల్లెందు జీఎం కార్యాలయం ఎదుట నాయకుల నిరసన

'కంపెనీపై చర్యలు తీసుకోండి'

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కోయగూడెం ఉపరితలగనిలో పని చేస్తున్న కార్మికులను కంపెనీ ఇబ్బందులకు గురి చేస్తోందని, ఆ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని టేకులపల్లి రాజకీయ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం జీఎం కార్యాలయంలో డీజీఎం జీఎం మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కోయగూడెం ఓసీ పీఓ, ఇల్లెందు డీఎస్పీ కార్యాలయాల్లోనూ జేఏసీ నాయకులు విన్నవించారు. లక్కినేని సురేందర్, దశ్‌సింగ్, డి.ప్రసాద్, వీరబ్రహ్మచారి, శివనాయక్, వరప్రసాద్, హర్షద్ పాల్గొన్నారు.

వారసత్వ విగ్రహాల పరిరక్షణకు చర్యలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణిలో కార్మిక విధి నిర్వహణను ప్రతిబింబించే విగ్రహాలను అనువైన స్థలంలో ఏర్పాటు చేస్తామని జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. ఇల్లెందు 21ఇంక్లైన్ ఆవరణలో వారి విధులను తెలియజేసే కార్మికుల విగ్రహాలను జీఎం సోమవారం పరిశీలించారు. వారసత్వంగా వస్తున్న వాటిని పరిరక్షించేలా అధికారులకు పలు సూచనలు చేశారు. అధికారులు రామస్వామి, జీవీ మోహన్‌రావు, రవికుమార్, నాగరాజు, అంజిరెడ్డి, కె.సారయ్య, జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కార్మికుల విగ్రహాలను పరిశీలిస్తున్న జీఎం జాన్ ఆనంద్

గౌడ సంఘం అధ్యక్షుడి ఎన్నిక

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ముకుందాపురంలో గౌడ సంఘం అధ్యక్ష ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం బలి యాకయ్య, పబ్బు శ్రీనివాస్ పోటీ పడటంతో ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్‌లో 136 మంది పాల్గొనగా ఇద్దరికీ 68 చొప్పున సమానంగా ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు వెంకటేశ్వర్లు, వల్లల రాజయ్య, మంద శంకర్, గట్టు కోటేశ్వరరావుతో పాటు గౌడ కులపెద్దలు చెరో ఏడాది అధ్యక్ష పదవిని కొనసాగేలా టాస్ వద్దని అనుసరించారు. వచ్చే దసరా వరకు శ్రీనివాస్, ఆ తర్వాత సంవత్సరం యాకయ్య అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించేలా ఆమోదించారు.



యాకన్న



శ్రీను

అంధకారం.. పొంచి ఉన్న ప్రమాదం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: ఇల్లెందు అడ్డరోడ్డు మూడు కూడళ్లను కలిపే జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో అంధకారం నెలకొంటోంది. మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం వైపులకు రాకపోకలు సాగించే వాహనదారులు ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్ష్మీదేవిపల్లి ఎంపీఓ శ్రీనివాసరావును వివరణ కోరగా.. సెంట్రల్‌తో వెలిగే వీధిదీపాలు ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బంది ఏర్పడుతోంది. దీపాలు వెలిగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆలోచన అదిరెను.. ఆదర్శంగా నిలిచెను!



ప్లాస్టిక్ సీసాలను కత్తిరించి పూల మొక్కలు నాటి వరుస క్రమంలో ఇలా..



కలెక్టర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కార్యదర్శి కృష్ణ (పాతచిత్రం)

సుజాతనగర్, న్యూస్‌టుడే: స్వచ్ఛత హీ సేవలో పర్యావరణ ప్రయోజనాల కోసం ప్లాస్టిక్ వ్యర్థాలను వినియోగానికి అనువుగా తయారు చేయటం ఎకో బ్రిక్స్ ఉద్దేశం. జిల్లాలో సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కుంచం కృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని ప్లాస్టిక్ సీసాలు సేకరించి వాటిలో మట్టి నింపి మొక్కలు నాటారు. వరుస క్రమంలో వాటన్నింటినీ వేలాడదీసి సుందరంగా అమర్చారు. పంచాయతీ కార్యాలయానికి వచ్చే ఆసక్తులు యేయ్యందుకు వేడుకలకు వినియోగించే డెకరేషన్ బల్లను తయారు చేయడంతో కార్యాలయంలోకి వెళ్లగానే చూపరులను ఆకట్టుకుంటోంది. కార్యదర్శి ప్రతిభను గుర్తించిన కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఈ నెల ఒకటిన ప్రశంసాపత్రం అందజేయడంతో పలువురు అభినందిస్తున్నారు.

'ఆజాద్ అధికార్ సేన పార్టీ' విస్తరణకు కృషి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'ఆజాద్ అధికార్ సేన పార్టీ'ని తెలంగాణలో విస్తరించనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అభయ్‌దేవ్ తెలిపారు. కొత్తగూడెంలో సోమవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనితీతిపై ఉద్యమించేందుకు మాజీ ఐపీఎస్ అమితాబ్ ఠాకూర్ ఈ పార్టీని స్థాపించారన్నారు. త్వరలో ఆయన హైదరాబాద్ రానున్నట్లు చెప్పారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి విశ్వాసాన్ని చూరగొంటామన్నారు. పార్టీ నాయకులు కోరే శ్యాంసుందర్, బి.ప్రేమ్ దయాళ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: యానంబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09లో విద్యాభ్యాసం సాగించిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పదిహేనేళ్ల అనంతరం కలుసుకోవడంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు, కుటుంబీకుల వివరాలు తెలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం గురువులు హెచ్ఎం ప్రకాశ్, విశ్రాంత హెచ్ఎం ప్రాన్సిస్, ఉపాధ్యాయులు వీరన్న, రామారావు, భవాని, లక్ష్మి, ఉదయశ్రీలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు